

## శరణు శరణు .. శాంభవీ

ఊరూ వాడ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

## సల్లంగా చూడాలో ఉయ్యాలో..

ఘట్‌కేసర్ గురుకుల్‌లో సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు








రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





తూంకుంట రాజీవ్‌రహదారిన బాధితులు ర్యాలీ, రాస్తారోకో చేసి నిరసన తెలిపిన దృశ్యం




# కారిడార్ కాక

**రోడ్డు విస్తరణ బాధితుల రాస్తారోకో**

**మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్**

**కలెక్టర్‌తో నేరుగా చర్చలకు ఏర్పాటు చేయాలని ఆందోళన**

**200 ఫీట్ల నుంచి 120 ఫీట్లకు రోడ్డు వెడల్పు తగ్గించాలని నిరసన**

**శామీర్‌పేట, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** రాజీవ్‌రహదారిన ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు ఏర్పాటులో భూములు, షాపులు, స్థలాలు కోల్పోతున్న బాధితులు తూంకుంటలో రాజీవ్‌రహదారిన రాస్తారోకో చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం శామీర్‌పేట మండలం తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహంకు పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆ తరువాత బాధితులు రాజీవ్‌రహదారిన నిరసన ర్యాలీ నిర్వహించి, ఆ తరువాత అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్‌రహదారిన బాధితులు రాస్తారోకో నిర్వహించి అందోళన వ్యక్తం చేశారు. దీనికి ముందుగా షాపులను స్వచ్ఛంధంగ బంద్ పాటించి నిరసన ర్యాలీలో వారు పాల్గొన్నారు. భూములు కోల్పోతున్న బాధిత అసోసిషియేషన్ జెఎసి చైర్మన్ సతీష్‌గుప్తా, (డి) బ్లాక్ ఇంచార్జి కాసుల ఈశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిరసన, రాస్తారోకో, ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ సతీష్‌గుప్తా, డి.బ్లాక్ ఇంచార్జి కాసుల ఈశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచు బి.దయాసాగర్‌యాదవ్, కె.సుభాష్‌గౌడ్‌లు పలువురు మాట్లాడుతూ అయితే నగరంలోని ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ రోడ్డు వరకు రాజీవ్‌రహదారిన జెబిఎస్, కార్ఖానా, లాల్‌బజార్, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకీంపేట్, పోతాయిపల్లి, తూంకుంట, శామీర్‌పేట ఓఆర్ఆర్ సర్కిల్ వరకు రాజీవ్‌రహదారిన 200ఫీట్ల వెడల్పుతో ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణం చేపట్టటానికి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సిద్ధం చేసి అన్ని ఏర్పాట్లు చేస్తుందని,తమకు ఇంత వరకు పరిహారం చెల్లింపులో ఎలాంటి నిర్ణయం తెలుపలేదని, స్పష్టమైన హామీ ఇవ్వలేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే రాజీవ్‌రహదారిన భూములు, దుఖాణసముదాయాలు, షాపులు, స్థలాలు కారిడార్ రోడ్డు వెడల్పు 200ఫీట్లతో నిర్మాణం పనులు చేపట్టటానికి సంబంధిత అధికారులు కార్యచరణకు సిద్ధం చేయటంతో బాధితులకు ప్రభుత్వం స్పష్టమైన హామీ పరిహారం చెల్లింపు విషయంలో సంబంధిత అధికారులు మాట్లాడటం లేదని అన్నారు. సంబంధిత అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నా బాధితులు చెప్పిన దాన్ని పట్టించుకోకుండ నిర్లక్ష్యం జరుగుతుందని అన్నారు. అయితే ప్రభుత్వ మార్కెట్ ప్రకారం తూంకుంటలో మాత్రం గజానికి 12,500రూపాయలు విలువ ఉందని, బయట మార్కెట్ రేట్ మాత్రం గజానికి లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకు నడుస్తుందని బాధితులు పేర్కొన్నారు. ఈ రోడ్డు వెడల్పు నిర్ణయం వల్ల ఎంతో మంది ఆస్తులతో పాటు వ్యాపారపరంగ, జీననోపాధి కోల్పోవలసి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం మిగతా 4లో




మోమిన్‌పేట మండలంలో దెబ్బతిన్న కందిపంట, ధారూరు మండలంలో పత్తి పంట పరిస్థితి

# సర్వనాశనం

**80 వేల ఎకరాలలో నష్టం - అన్నదాతలను చావుదెబ్బతీసిన భారీ వర్షాలు**

**జిల్లాలో అత్యధికంగా కంది పంటే జీవనాధారం**

**దిగుబడులు చేతికందుతున్న తరుణంలో మింగేసిన వాన**

**కూరగాయ తోటలూ నేలమట్టం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కనీవినీ ఎరుగని రీతిలో వర్షాలకు పంటలు సర్వనాశనం అయ్యాయి. జూలై నుంచి సెప్టెంబరు చివరి వారం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతన్నలు విలపించేలా చేస్తున్నాయి. సెప్టెంబరు రెండోవారంలో కాస్త తగ్గుముఖం పట్టాయకున్న వర్షాలు నాలుగు రోజులుగా బీభత్సం సృష్టించి అతలాకుతలం చేశాయి. వికారాబాద్ జిల్లాలో సుమారు 80 వేల ఎకరాలలో పంటలు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా. జిల్లాలో 3 లక్షల ఎకరాల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయి. ప్రధాన పంటల్లో పత్తి, కంది, మినుము, పెసర, సోయాబీన్, మొక్కజొన్న పంటలు వేసుకున్నారు. మూడు నెలలకే చేతికి వచ్చే పెసర పంటలో 25 శాతం చేతికి వచ్చింది. కానీ మినుము పంట మాత్రం 90 శాతం నీట మునిగి రైతులు నష్టపోయారు. అక్టోబరు నుంచి చేతికి వచ్చే పత్తి పంట కూడా వర్షాలకు తడిసిపోయింది. నాణ్యమైన పత్తి దిగుబడి అయ్యే అవకాశాలు సన్నగిల్లాయి. నల్లరేగడ్లలో వేసుకున్న పంటలకు అతిగా నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. చలక నేలల్లో కాస్త నీరు నిల్వకుండా ఉండటం వల్ల 30 శాతం పత్తి పంట చేతికి రావచ్చని భావిస్తున్నారు. జనవరి నుంచి దిగుబడులు సాధించే కంది పంట చాలాచోట్ల నేల మట్టమైంది. జిల్లాలో అధికంగా కంది పంటపైనే రైతులు ఆధారపడ్డారు. అది కూడా తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లోనే ప్రతియేటా నమూదు మిగతా 4లో

# నెలకు 3 సార్లు ఇక్కడికే వస్తా

**ఫ్యూచర్ సిటీ నుంచే కార్యకలాపాలు చేస్తా**

**డిసెంబర్ నాటికి డెవలప్‌మెంట్ భవనం, స్కిల్ యూనివర్సిటీని పూర్తి చేస్తాం**

**ఫ్యూచర్ సిటీని ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం**

**ఇందుకు మీ అందరి సహకారం ఉండాలి**

**ఉదారంగా మిమ్మల్ని ఆదుకునేందుకు సిద్ధం**

**రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దు**

**తక్షణమే మీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నా**

**ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి శంకుస్థాపన సభలో సిఎం రేవంత్**



**మహేశ్వరం, సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ఫ్యూచర్ సిటీపై కొందరూ కావాలనే రాజకీయం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ అంటూ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనకు ఇక్కడ భూములు ఉన్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీ నిర్మాణమని ఉద్ఘాటించారు. కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ -1 నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. అంతకుముందు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డికి, డిప్యూటి సీఎం భట్టి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లకు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ నగరంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. మంచి సంకల్పంతో తలపెట్టిన ఈ ప్రారంభోత్సవానికి వరుణ దేవుడు కూడా సహకరించాడని అన్నారు. చాలా మంది తనపై, ఈ ప్రాజెక్టుపై కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఇక్కడ నాకేదో భూములు ఉన్నాయని, అందుకే ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఇది నా కోసమో, నా కుటుంబం కోసమో కాదు, భవిష్యత్ తరాల భవిష్యత్తు కోసం నిర్మిస్తున్నాం అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్ర్చ్యూన్ 500 కంపెనీలు ఈ భారత్ ఫ్యూచర్ సిటీలో ఉండాలన్నదే మా లక్ష్యం అన్నారు. ఫ్యూచర్ సిటీని ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఇందుకు మీ అందరి సహకారం ఉండాలని తెలిపారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుందాం. ప్రభుత్వం ఉదారంగా మిమ్మల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉంది. నేను కూర్చుని మీ సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నా. రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దు. తక్షణమే మీ సమస్యలను పరిష్కరించాలని మా అధికారులను ఆదేశిస్తున్నానని తెలిపారు. అందరికీ న్యాయం చేయాలనేదే మా ప్రయత్నం, డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ భవనం, స్కిల్ యూనివర్సిటీని పూ... మిగతా 4లో



కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి, శంకుస్థాపన సందర్భంగా ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, డిసిఎం భట్టి విక్రమార్క తదితరులు

# ఉన్నత భవిత కోసమే ఎటిసి

**మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి**




శామీర్‌పేటలోని ప్రభుత్వ ఐటిఐలో ఎటిసిని ప్రారంభించి మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి), సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల (ఎటిసి) ద్వారా విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని బయటకి తీసి మంచి భవిషత్ ఇవ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఐటిఐ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శామీర్‌పేటలోని ప్రభుత్వ ఐటిఐ కాలేజీలో ఎటిసి సెంటర్‌ను కలెక్టర్ విచ్చేసి లాంఛనంగ ప్రారంభించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఐటిఐలను పునరుద్దరించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగ మీరు ఆలోచించి ఆవిష్కరణలను రూపొందించాలని ఆయన సూచించారు. మీరు నేర్చుకునే అంశం గురించి తప్పకుండ మీ తోటి వారితో చర్చించాలని తద్వారా అ ఆంశంపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. మీలోని భయాన్ని విడిచి నలుగురిలో మాట్లాడేలా మిమ్మల్నిమీరు తీర్చిదిద్దుకోవాలన్నారు. అందువల్ల భవిషత్‌లో ధైర్యంగా ఇంటర్వ్యూలలో సమాధానం ఇవ్వగలుగుతారని విద్యార్థులకు ఆయన హితభోద చేశారు. ఎక్కువగా విద్యార్థులకు ఇంటర్వ్యూలలో థియరీ నాలెడ్జ్ లేకపోవటం ద్వారా ఉద్యోగాలు రావటం లేదని, ఈ సమస్యను అధిగమించటానికి ప్రభుత్వం మిగతా 4లో

# భారతీయ సంస్కృతికి మూలం కన్హాశాంతి వనం

**కేంద్ర పర్యావరణ అటవీ మంత్రి భూపేందర్ యాదవ్**

**నందిగామ, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతి, ప్రకృతి పరిరక్షణకు,ప్రపంచ దేశాలకు వేదికగా కన్హా తపోవనం నిలవడం గర్వకారణమని కేంద్ర పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం నందిగామ మండలం కన్హా శాంతి వనంలో హార్ట్ ఫుల్ నెస్ మార్గదర్శి దాజి 70 వ జన్మదిన వేడుకలకు హాజరైన కేంద్ర మంత్రి, భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ తో కలిసి దాజీ రచించిన గ్రంథాలను విడుదల చేస్తూ శాంతి వనంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన మరియు జీవనశైలిలో మార్పులకు సంబంధించిన సరళమైన సాధనాలను ప్రకృతిని ప్రేమించడం, శాంతి, ఆనందం, జ్ఞానాన్ని నింపడం, ధైర్యం, కరుణ, ఆలోచనల్లో స్పష్టత పెంపొందించడానికి సహాయ పడతాయి అన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ మాట్లాడుతూ దాజి అనుభూతులను పంచుకుంటూ, తనకున్న అనుబంధాన్ని దైవానుగ్రహంగా భావిస్తున్నానన్నారు. మిగతా 4లో



మొక్కలు నాటుతున్న దృశ్యం



# ఎన్ని'కల్లు' చెదిరిందా!

**హైకోర్టుకు చేరిన బిసి రిజర్వేషన్ వ్యవహారం**

**అక్టోబరు రెండోవారంలో చర్చకు వచ్చే అవకాశం**

**అన్ని రిజర్వేషన్లు కలిపి 50 శాతం దాటవద్దని స్పష్టం చేసిన ఉన్నత న్యాయస్థానం**

**'స్థానిక' ఆశలపై తాత్కాలికంగా నీళ్లు**

**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తర్వాతే నిర్ణయం ?**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** స్థానిక సమరంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ముందుకు వచ్చింది. శనివారం సాయంత్రం జీవో జారీ చేసింది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కొందమంది కోర్టును ఆశ్రయించారు. అక్టోబరు రెండోవారంలో ఈ అంశంపై చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం బిసిలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని ముందుకు వచ్చినా న్యాయస్థానం నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనాయి. దాంతో నాటి ప్రభుత్వం అంశాన్ని విరమించుకుంది. 42 శాతం బిసిలకు రిజర్వేషనన్లు కల్పిస్తే ఇతర వర్గాలన్నీ కలిపి 60 శాతానికి మించి పోతుందని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిబంధనలకు విరుద్ధమంటూ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రతికూల పరిస్థితులు గమనిస్తే స్థానిక సంస్థల ఎన్నికల మరి కొన్ని రోజుల వరకు వాయిదా పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల కోసం ఇంత కాలం ఎదురు చూసిన ఆశావాహులపై నీళ్లు జల్లినట్లయింది. శనివారం సాయంత్రం అధికారులు జడ్పీ, జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాల రిజర్వేషన్లను ప్రకటించారు. తమ నుంచి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రక్రియ పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు కూడా దాదాపు పూర్తయ్యాయి. రిజర్వేషన్ల అంశంపై కోర్టు నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు ఎన్నికల షెడ్యూల్ వెలువడక పోవచ్చని భావిస్తున్నారు. వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్ పదవి బిసి (జనరల్)కు కేటాయించారు. జిల్లాలో తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి నియోజకవర్గాలలో 20 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. పరిగి నియోజకవర్గంలో జనరల్‌కు ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా కేటాయించలేదు. చైర్మన్ సీటుపై కన్నేసిన జనరల్ అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురైనారు. బీసీ చైర్మన్ అభ్యర్థులలో కాంగ్రెస్ టిక్కెట్ రేసులో ముగ్గురు అభ్యర్థులు ఉండగా బీఆర్ఎస్, బీజేపీలో ఇంకా ముందుకు రాలేదని తెలుస్తున్నది. ఒకవైపు వర్షాలు, మరోవైపు జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక కూడా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా, మండల పరిషత్‌ల పదవి కాలం ముగిసి 15 మాసాలు గడుస్తున్నాయి. పంచాయతీల పదవి కాలం పూర్తయి రెండేళ్లవుతోంది. మిగతా 4లో

# రిజర్వేషన్..పరేషాన్

**జడ్పీ 'జనరల్' చేజారడంతో 'బుయ్యని' నిరాశ**

**పాలమూరులో సిఎం సోదరుడితో రహస్యభేటీ**

**పరిగిపై ఫోకస్ పెట్టాలన్న అనుచరగణం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కన్నేసిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి రిజర్వేషన్లు మారడంతో ఆయన అనుచరులు తీవ్ర నైరాశ్యానికి గురైనారు. జడ్పీ జనరల్‌కు కేటాయిస్తే శ్రీనివాస్‌రెడ్డి లేదా ఆయన సతీమణి సరళారెడ్డి పోటీ చేయాలని యోచించారు. జడ్పీ బీసీ జనరల్‌కు కేటాయించడంతో శ్రీనివాస్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ గురించి సుదీర్ఘ చర్చలు జరిగినట్లు తెలిసింది. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తన మిత్రుడి నివాసంలో శ్రీనివాస్‌రెడ్డి, 35 మంది అనుచరులు రహస్యభేటీ నిర్వహించారని విశ్వసనీయవర్గాల సమాచారం. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయనపై అనుచరులు తీవ్ర ఒత్తిడి చేసినట్లు తెలిసింది. పరిగి నియోజకవర్గం కులకచర్ల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బుయ్యని బ్రదర్స్ తాండూరులో బిజినెస్ రంగంలో స్థిరపడిపోయారు. ఆర్‌బీవోఎల్ కర్మాగారం సీఈవోగా శ్రీనివాస్‌రెడ్డి, ఎండీగా ఆయన సతీమణి సరళారెడ్డి కొనసాగుతున్నారు. వందలాది మంది స్థానికులకు ఉపాధి కల్పించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. రక్షణశాఖ సహాయనిధికి కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి సహాయం చేస్తున్నారు. 2023లో తాండూరు అసెంబ్లీ టిక్కెట్ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డికే ఇస్తున్నట్లు కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. చివరి నిముషంలో ఆయన సోదరుడు బుయ్యని మనోహర్‌రెడ్డికి టిక్కెట్ ఇచ్చారు. డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతూ పరిగి నుంచి బీఆర్ఎస్ టిక్కెట్ ఆశించిన మనోహర్‌రెడ్డికి చివరి నిముషంలో అధిష్టానం టిక్కెట్ ఇవ్వలేదు. జడ్పీటీసీగా, డీసీసీబీ చైర్మన్‌గా విశేష ప్రజాధరణ పొందిన మనోహర్‌రెడ్డి కోసం ఆయన సోదరుడు బుయ్యని



మూడురోజుల క్రితం బుయ్యని నివాసానికి వచ్చిన సీఎం సోదరుడు



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

**ఆమనగల్లు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌కి గుణపాఠం తప్పదని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావు అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలం చెందిందని, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అర్జున్‌రావు జోస్యం చెప్పారు. ఆమనగల్లు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్‌ఖలీల్, పార్టీ శ్రేణులతో కలిసి అర్జున్‌రావు విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో ప్రజాపాలన గాడితప్పిపోవడంతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు కెసిఆర్ నాయకత్వంలోని రామరాజ్యాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఓటమిని ముందే అంచనా వేసిన రాష్ట్ర సర్కారు ఉద్దేశపూర్వకంగా ఎన్నికల నిర్వహణను హైకోర్టు తీర్పు ఒత్తిడికి గురై ఆదరబాదరకు తెరలేపిందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు పట్టం కట్టాలని అర్జున్‌రావు కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు గండికోట శంకర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.




చేవెళ్లలో శాఖాహర ర్యాలీని నిర్వహిస్తున్న చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య

## శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే యాదయ్య

**చేవెళ్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ధాన్యం తప్పని సరిగా చేయాలని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య పిలుపునిచ్చారు. రామన్న గూడ మాజీ సర్పంచ్ లావణ్య శంకర్‌లు నిర్వహించిన శాఖాహర ర్యాలీని ఆదివారం చేవెళ్ల మండలం కేంద్రంలో చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఆరోగ్యంగా అనందంగా జీవించడానికి శాఖహరంతో పాటు ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అకులు అలం తినే జంతువులు కొండలు గుట్టలు ఎక్కుతుంటే మాసం తింటున్న మానవుడు మాత్రం సరిగ్గా నడువలేక పోతున్నాడన్నారు. మనిషి రోజు రోజుకు రోగాలపాలై మంచం ఎక్కుతున్నాడన్నారు. గాంధీ, బుద్ధ భగవానుడు, అంబేద్కర్ లాంటి మహాశయుల మార్గాన్ని అశయాన్ని బ్రహ్మర్షి పితామహ పత్రీజీ అచరించారన్నారు. సమాజం మార్పుకు శాఖాహర ర్యాలీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలక్రిష్ణా, సదానందం, కాంగ్రేస్ పార్టీ నాయకులు పిరమిడ్ సోసైటీ మాస్టర్స్, దామోదర్‌రెడ్డి, బాలక్రిష్ణా, లక్ష్మీ, బంగ్లా అంజనేయరెడ్డి, నవీన్, బాలక్రిష్ణారెడ్డి, చంద్రశేఖర్, రాజశేఖర్, ప్రవీన్, శైలజ, తిరుపతయ్య, లావణ్య, విష్ణు, బాబు, రాజేందర్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస, యాదయ్య తదతరులు పాల్గొన్నారు.



జాషువాకు నివాళులర్పిస్తున్న నాయకులు

## జాషువా జయంతిని అధికారికంగా జరపాలి

**మంచాల సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ఆరుట్ల గ్రామంలో గుర్రం జాషువ 130వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాషువ రచయితగా గబ్బిలం, కవి కోకిల, నవయుగ కవిగా, విశ్వ కవిగా, చక్రవర్తిగా, రచనలు, బిరుదులు, ఉపాధ్యాయుడిగా, తన రచనలు అభ్యుదయ భావాలు కలిగిన సాంప్రదాయ కవిగా, వేదన భరిత అనుభవంతో జీవిత అనుభవంతో మానవ జీవితాన్ని వ్యాఖ్యానించిన కవి జాషువా జీవితం నుండి ఒక ఎమ్మెల్సీగా చట్టసభలో ఎన్నో అనుభవాలను తెలిపిన మహాకవి గుర్రం జాషువ అని అన్నారు.ఇలాంటి మహాకవి దళితుడైనందున ప్రభుత్వం ఆయన జయంతి వేడుకలు అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కంబాలపల్లి భాస్కర్, ప్రజా సంఘాల నాయకుడు, మాజీ ఎం.పి.టి.సి చీరాల రమేష్, మంకు మురళి,మాడుగుల కృష్ణ , గుడ్డు మల్లి చంద్రయ్య, అనంగాల పరమేష్, జానీ పాషా, పున్నం రాము, కోర జంగయ్య, తదితరులు పాల్గొని జాషువా ఘనమైన నివాళులు అర్పించారు.

## ఆమనగల్లులో కెటిఆర్‌కు ఘన స్వాగతం

**ఆమనగల్లు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌కు ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగర్జన బహిరంగసభకు తరలివెళుతున్న కెటిఆర్‌కు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. తలకొండపల్లి మండల మాజీ జడ్పిటీసి కల్వకుర్తి నియోజకవర్గ కీలక నేత ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆమనగల్లుకు తరలివచ్చారు. కెటిఆర్ పట్టణంలో రాజీవ్ చౌరస్తా వద్దకు చేరుకోగానే వాహనం నుండి బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేయగా, ప్రజలు ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. అంతకు ముందు డిజె సౌండ్‌తో గులాబిపార్టీ పాటలకు శ్రేణులు డాన్స్‌లు చేస్తూ ఆకట్టుకున్నారు. బస్టాండ్ ప్రాంతానికి చేరుకోగానే అభి మానులు బాణాసంచాలు కాల్చి సందడి చేశారు. భారీగా తరలివచ్చిన అభిమానులు కెటిఆర్ కాన్వా య్‌ను అనుసరిస్తూ ముందుకు కదలింది. కార్యక్రమంలో ఉప్పల వెంకటేశ్, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, పొనుగోటి అర్జున్‌రావు, పత్యానాయక్, నిర్మళశ్రీశైలంగౌడ్, నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఖలీల్, సోన శ్రీనునాయక్, టిప్పు సుల్తాన్, పంతునాయక్, దేరంగుల గణేశ్, దేరంగుల వెంకటేశ్ ఉన్నారు.



అభిమానులతో కరచాలనం చేస్తున్న మాజీ మంత్రి కెటిఆర్

## జిల్లెడు చౌదరిగూడలో రాజుకున్న ఎన్నికల వేడి

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు, 28 ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన ఎన్నికల రిజర్వేషన్లను ప్రభుత్వం విడుదల చేయడంతో స్థానికంగా రాజకీయ వర్గాల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. ఈ వివరాలను సంబంధిత అధికారులు విడుదల చేశారు. మండలంలోని తొమ్మిది ఎంపిటిసి స్థానాల రిజర్వేషన్లు ఇలా ఇన్నాయి. మండలంలోని ఎదిర ఎస్‌టి, గుంజల్‌పహాడ్ ఎస్సీ, ఇందిరనగర్ ఎస్సీ మహిళ, తుమ్మలపల్లి బీసి, జిల్లెడు బీసి మహిళ, పద్మారం బిసి మహిళ, పెద్ద ఎల్కిచర్ల బిసి, వీరన్నపేట జనరల్ మహిళ, చేగిరెడ్డి ఘనాపూర్ జనరల్ స్థానాలుగా ఉన్నాయి. సర్పంచ్ రిజర్వేషన్లు ఇల్లా ఉన్నాయి. చేగిరెడ్డి ఘనాపూర్ బిసి జనరల్, చింతకుంటతాండ ఎస్‌టి మహిళ, చౌదరిగూడ జనరల్ మహిళ, ధర్మ్యాతాండ ఎస్‌టి జనరల్, ఎదిర బిసి మహిళ, ఎల్కగూడ బిసి జనరల్, గాలిగూడ జనరల్ మహిళ, గుంజల్‌పహాడ్ ఎస్సీ జనరల్, గుర్రంపల్లి ఎస్సీ జనరల్, ఇందిరనగర్ బిసి మహిళ, జాకారం జనరల్ జిల్లెడు బిసి మహిళ, కాస్లాబాద్ ఎస్‌టి జనరల్, లచ్చంపేట జనరల్, ముష్టిపల్లి బిసి జనరల్, పద్మారం బిసి జనరల్, పెద్ద ఎల్కిచర్ల ఎస్సీ మహిళ, పీర్జాపూర్ జనరల్, రావిర్యాల బిసి జనరల్, తూంపల్లి జనరల్, తుమ్మలపల్లి బీసి మహిళ, వాచ్చ్యతాండ జనరల్ మహిళ, వనంపల్లి ఎస్సీ మహిళ, వీరన్నపేట జనరల్ మహిళ స్థానాలుగా ఉన్నాయి. ఎన్నికల రిజర్వేషన్లు విడుదల కావడంతో ఆయా గ్రామాలలో ఆశా వాదులు ఎన్నికలను సిద్ధం అవుతున్నారు.

**పూడూరు మండలంలో..**

**పూడూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలో 13 ఎంపిటిసి స్థానాలకుగాను ఆయా నియోజకవర్గాలకు రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు శనివారం రాత్రి అధికారులు వెల్లడించారు. (1)ఎన్కెపల్లి జనరల్, (2)మన్నెగూడ బిసి జనరల్,(3)అంగడి చిట్టంపల్లి బిసి మహిళ, (4)చెన్‌గోముల్ బిసి జనరల్, (5)చీలాపూర్ ఎస్‌సి మహిళ,(6)పూడూరు జ బిసి మహిళ,(8)పెద్ద ఉమ్మెంతాల్ ఎస్‌సి జనరల్, (9)మేడిపల్లి కలాన్ ఎస్‌సి జనరల్,(10)కద్మూరు బిసి జనరల్,(11)కంకల్ జనరల్ మహిళ, (12)మంచన్‌పల్లి బిసి మహిళ, (13)నిజాంపేట్ మేడిపల్లి జనరల్ మహిళగా రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పూడూరు జడ్పీటీసిగా ఎస్‌సి మహిళ, ఎంపిపిగా ఎస్‌సి మహిళకు కేటాయించినట్లు వివరించారు.

# ఆమనగల్లు ఈసారి జనరల్‌కే!

**ఎంపిపి, జడ్పీటీసి స్థానాలు ఒకే కేటగిరీకి ఖరారు**

**కొందరికి మోదం-మరికొందరికి ఖేదం మిగిల్చిన రిజర్వేషన్ల కోటా**

**వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న నేతలు**



ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

**ఆమనగల్లు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల వ్యవహారం కొందరికి మోదం.. మరికొందరికి ఖేదంగా మారింది. ఆయా స్థానాలపై ఆశలు పెట్టుకున్న నేతల అంచనాలు తల్లకిందులవడంతో ఎలాగైన అధికారం చేతిలో ఉంచుకోవటానికి వ్యూహాత్మకంగా పావులు కదపటానికి అనుచరులతో చర్చలు జరుపుతున్నారు. సామాజిక కోణంలో బిసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్‌తోపాటు మహిళలకు స్థానాలు కేటాయిసూ రిజర్వేషన్లను ప్రకటించారు. జిల్లా పరిషత్ సీఈఓ సారథ్యంలో అధికారులు రిజర్వేషన్ల కసరత్తు చేపట్టారు.

జిల్లా కలెక్టర్ జడ్పిటిసి, ఎంపిపి స్థానాల రిజర్వేషన్లు ఎస్టి, ఎస్సి, బిసి, జనరల్ రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేపట్టారు. ఈ వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లు ఎంపిపి, జడ్పీటీసితోపాటు 5 ఎంపిటీసిలు, 13 పంచాయతీ సర్పంచ్‌ల స్థానాలకు రిజర్వేషన్లు కేటాయించారు. అందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఆమనగల్లు ఎంపిపి, జడ్పీటీసి స్థానాలు ఈసారి జనరల్ కోటాకు రిజర్వ్ చేశారు. ఆమనగల్లు మండల పరిషత్‌లో 5 ఎంపిటీసి నియోజకవర్గాలు కోనాపూర్, ఆకుతోటపల్లి, పోలెపల్లి, మేడిగడ్డ, మంగళపల్లి ఉన్నాయి. అలాగే 13 గ్రామపంచాయతీలు ఆకుతోట పల్లి, చెన్నం పల్లి, చింతలపల్లి, కోనాపూర్, కొత్తకుంటతండా, మంగళపల్లి, మేడిగడ్డ, పోలెపల్లి, రాం నుంతల, సీతారాంనగర్‌తండా, శెట్టిపల్లి, సింగంపల్లి, శంకర్‌కొండతండాలు ఉన్నాయి. 5 ఎంపిటీసి స్థానాలలో బిసీలకు2 (జనరల్1, మహిళ1) ఎస్టీలకు 2 (జనరల్1, మహిళ1) మరొక స్థానాన్ని అన్‌రిజర్వ్‌కు (జనరల్) కేటాయించారు. అలాగే మండల పరిధిలోని 13 పంచాయతీ సర్పంచ్‌ల పదవులకు బిసీలకు 5 స్థానాలు (3 జనలర్. 2 మహిళలు) 4 ఎస్టీలకు ( జనరల్ 2, మహిళలు 2) ఎస్సీలకు 3 (జనరల్ 2, మహిళ 1) మరొక స్థానం అన్‌రిజర్వ్ (జనరల్)కు కేటాయిం చారు. ఎంపీపీ, జడ్పిటిసి స్థానాలతోపాటు పంచాయతీ సర్పంచ్‌ల స్థానా లకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు అందరి చూపు ఎన్నికల నోటిఫికేషన్ వైపు మళ్ళింది. రిజర్వేషన్‌ల కేటాయింపులు ఖరారు కావడం తో గ్రామాల్లో ఎన్నికల సెగలు రాజుకుంటున్నాయి.

**ఎంపిటిసి స్థానాలు ఇలా..**

ఆకుతోటపల్లి-బిసి (జనరల్), కోనాపూర్-బిసి (మహిళ), మంగళపల్లి-ఎస్టీ (మహిళ) మేడిగడ్డ-జనరల్, పోలెపల్లి (ఎస్టీ జనరలర్)

# చేవెళ్ల కోర్టులో ఫేక్ అర్డర్ కలకలం!

**బాధ్యులపై చర్యలకు జిల్లా న్యాయస్థానం అదేశం**

**చేవెళ్ల, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** చేవెళ్ల కోర్టులో నకిలీ ఇంజక్షన్ అర్డర్ వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంపై సీరి యస్ అయిన జిల్లా న్యాయస్థానం బాధ్యులపై తక్షణ చర్యలకు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. ఐఎ నంబర్ 710/2024 ద్వారా ఒఎస్ నంబర్ 220/2024లో గత ఏడాది అక్టోబరు 1న నకిలీ ఇంజక్షన్ అర్డర్ జారీ చేశారని బార్ అసోసియేషన్ సభ్యురాలు పి.రోజారెడ్డి న్యాయమూర్తి ఫిర్యాదు చేశారు. నకిలీ ఆర్డర్ ప్రకారం..షాబాద్ తహసీల్దార్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలోని సర్వే నంబర్ 50లో 8.27 కుంటల విస్తీర్ణం గల భూమిని ధరణిలో బ్లాక్ చేయించారని కోర్టుకు వివరించారు. వాస్తవానికి ఐఎ నంబర్‌లో ఎలాంటి ఇంజక్షన్ ఆర్డర్ జారీ అవ్వలేదని రోజారెడ్డి పేర్కొంటూ నకిలీ పత్రాలను సృష్టించిన వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



చేవెళ్ల కోర్టు భవనం

**కోర్టు ఫైళ్లు తారుమారు?**

**సిసి ఫుటేజి విచారణలోనూ నిర్ధారణ**

మరోవైపు గతంలో ప్రముఖ న్యాయవాది ఒకరు ఓ సివిల్ దావాకు సంబంధించి బెంచ్ హాల్‌లో ఇష్టాను సారంగా తిరుగుతూ పలు వ్యాఖ్యలు చేశారని, ఒఎస్ నంబర్ 125/2020లో ఐఎ నంబర్ 417/2020లో మంజూరు చేసిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని పట్టు బట్టారని, మరో సీనియర్ న్యాయవాదితో వాగ్వివాదానికి దిగారని కోర్టు అధికారులు జిల్లా న్యాయ స్థానానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆవరణలో ఏమి జరుగుతోందని అసహనం వ్యక్తంచేసిన న్యాయమూర్తి దీనికి సంబంధించిన సిసి పుటేజిని పరిశీలించాలని కోర్టు సూపరిండెంట్‌ను అదేశించారు. దీంతో సిసి పుటేజీ పరిశీలించగా సదరు న్యాయవాది రికార్డుల గదిలోకి వెళ్లి ఫైల్స్‌ను చూస్తున్నట్లు చూసి తాను తెచ్చుకున్న డైరిలో నుండి కాపీలను ఫైల్‌లో పెడుతున్న దృశ్యం స్పష్టంగా కనిపించటంతో ఈ విషయాన్ని జిల్లా న్యాయ స్థానం దృష్టికి తీసుకెళ్లారు. చేవెళ్ల న్యాయ స్థానం ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన జిల్లా న్యాయ స్థానం ప్రాథమిక విచారణ చేసింది. తప్పు జరిగిందని స్పష్టమవడంతో నోటీలు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోర్టు అధికారులు అదేశించింది.

నకిలీ ఇంజక్షన్ అర్డర్ వ్యవ హారంలోనూ బాధ్యులపైన చర్యలు తీసు కోవాలని కోర్టు అధికారులకు జిల్లా న్యాయ స్థానం అదేశాలు జారీ చేసింది.

**న్యాయమూర్తిపైనే ఆరోపణలా!**

చేవెళ్ల కోర్టులో జరుగుతున్న అవకతవకలపై జిల్లా న్యాయ స్థానానికి ఫిర్యాదులు చేసినందుకు కొందరు న్యాయవాదులు న్యాయమూర్తిపై అసత్య అరోపణలు చేయటం తగదని బార్ అసోసియేషన్ వర్గాలు ఖండిచాయి. ముక్కుసూటిగా పని చేస్తున్న న్యాయ మూర్తులపైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ ఇంజక్షన్ అర్డర్‌ను ఎవరు? ఎక్కడ తయారు చేశారన్న విషయాన్ని నిగ్గుతేల్చాలని కోరుతున్నారు. న్యాయ మూర్తికి తెలియకుండా న్యాయమూర్తి సంతం పోర్జరీ చేశారా? నకిలీ ఇంజక్షన్ అర్డర్‌పైన ఉన్న స్టాంపులు ఒరిజినలా? నకిలీవా? అనేది తేలాలని కోరారు.

# చరిత్రలో చిరస్థాయిగా నిలిచే పనులే చేస్తా

**చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మాలతీ కృష్ణారెడ్డి**

**చేవెళ్ల, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ప్రజలకు నిత్యం ఉపయోగపడే పనులను, చరిత్రలో చిరస్థాయిగా నిలిచే పనులను మాత్రమే చేస్తామని చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన దుర్గామాత భక్తులకు నిలువ నీడ లేక పోవడంతో వర్షంలో తడుస్తూ భక్తులు పడుతున్న ఇబ్బందులను గ్రహించి స్వంత నిధులతో దుర్గా మాత భక్తులకు తల దాచుకునేందుకు పడుకు నేందుకు షేడ్ నిర్మాణంకు చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి ముందుకు వచ్చారు. దుర్గామాత భక్తులకు నిర్మించే షేడ్‌కు ఆది వారం గ్రామస్తులతో భక్తులతో కలిసి శంకుస్తాపన చేశారు. ఈ సంద ర్భంగా చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భక్తులు సేద తీరేందుకు పెద్ద షేడ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చిరస్థాయిగా నిలిచే పనులు చేపట్టేందుకు ఎల్లప్పుడు ముందు ఉంటామన్నారు. ప్రజలు సమస్యలను తీర్చేందుకు ప్రజలకు అవసరమైన పనులు చేసేందుకు నిరంతరం పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ జెఎల్‌ఆర్, చేవెళ్ల మాజీ జడ్‌పిటిసి బాల్‌రాజ్, చేవెళ్ల మాజీ ఎంపిటిసి గుండాల రాములు, గ్రామస్తులు బుడ్డన్నగారి జంగారెడ్డి, అర్ధ శేఖర్‌రెడ్డి, కనకమామిడి ఆనంతరెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, అల్లాడ వెంకట్‌రెడ్డి, నత్తి క్రిష్ణారెడ్డి, వడ్ల ఆనంద్, మంగలి యాదగిరి, కందవాడ మూణిక్యం, చాకలి క్రిష్ణా,బురాన్ విఠలయ్య, ప్రశాంత్, తలారి యాదయ్య, బిజెపి నాయకులు పాండురంగారెడ్డి, డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి,అత్తెల్లి అనంతరెడ్డి, గుడిపల్లి మధుసూదన్‌రెడ్డి, అల్లాడ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుర్గా మాత భక్తుల కోసం షేడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న

# పెన్షనర్ల హామీలు అమలు చేయాలి

**విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి**

**ఆమనగల్లు, సెప్టెంబర్28, ప్రభాతవార్త:** ఆమనగల్లు సెక్టార్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షునిగా నారోజు రామనాథం, ప్రధాన కార్యదర్శిగా నల్లజంగయ్యలు నూతనంగా ఎన్నికయ్యారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆమనగల్లు సెక్టార్ నూతన కార్యవర్గ సంధర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన నూతన కార్యవర్గ ఎంపికకు సెక్టార్ పరిధిలోని ఆమనగల్లు, మాడుగుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, ఫ్యామిలి పెన్షన్‌దారులు పెద్ద సంఖ్యలో హాజరైనారు.జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పెన్షనర్ల ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించారు. ఇటీవల ప్రభుత్వము ఇచ్చిన హామీలన్నిటికీ తక్షణమే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేయడం చేశారు. రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన బకాయిలు, ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేయడం చేశారు. ఐదు విడతల కరువు బత్యాలను ప్రకటించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా నగదు రహిత హెల్త్ కార్డులు, నూతన వేతన సవరణలను వెంటనే అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చకుంటే త్వరలోనే కార్యాచరణతో ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఆమనగల్లు సెక్టార్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్టార్ సంఘం అధ్యక్షులుగా నారోజు రామనాథం, ప్రధాన కార్యదర్శిగా నల్ల జంగయ్య, ఆర్థిక కార్యదర్శిగా జిల్లెల సుదర్శన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా ఎంగలి బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి వెంకట్ రెడ్డి,టి. సుజాత, సంయుక్త కార్యదర్శిగా టి. నారాయణగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లట్టుపల్లి హరికిషన్‌రెడ్డి ప్రచార కార్యదర్శిగా సి.శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కౌనిలర్స్‌గా కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, గుర్రం భద్రయ్య, ఎల్.నర్సి రెడ్డి, టీ విద్యాధర్, మహాలింగం, ఆంజనేయులు ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం చేసిన దృశ్యం

# పాలమాకుల పోరాటాలు స్ఫూర్తిదాయకం

**షాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పాలమాకుల జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు షాబాద్ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం తెలిపారు. శనివారం ఆయన షాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని చండీగర్ పట్టణ కేంద్రంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ 25వ జాతీయ వసభలలో సిపిఐ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాలమాకుల జంగయ్య ఎన్నికయ్యారని తెలిపారు. ప్రస్తుతం సిపిఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఆయన పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు, రాజీలేనిపోరాటాలు నిర్వహించి బడుగు బలహీన వర్గాల కోసం అలుపెరుగకుండా అహర్నిశలు శ్రమిస్తూ అందరి మన్ననలు పొందిన వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. రాష్ట్ర పార్టీ ఏ పిలుపును ఇచ్చినా జిల్లాలో అందరి నాయకత్వాన్ని ఏకంచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఆయన కృషి ఎంతగానో ఉందన్నారు. జిల్లాలో విద్యార్థి, యువజన, మహిళ లాంటి ప్రజా సంఘాలను బలోపేతం చేయడంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారని, అలాంటి వ్యక్తికి పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడుగా నియమించడం హర్షదయాకమన్నారు. ప్రజలతో మమేకమవుతూ పార్టీలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం, నారాయణ, మధు కుమార్, తదితరులు ఉన్నారు.



సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నియమితమైన జంగయ్యను సన్మానిస్తున్న పార్టీ నాయకులు



బిక్షపతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

## బిక్షపతికి విద్యారత్న పురస్కారం

**మంచాల సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ విద్యారత్న పురస్కారం అందుకున్న డాక్టర్ ఎస్.కే బిక్షపతి దంపతులను ఆదివారం మండల అధ్యక్షులు కొత్తూరు శేఖరప్ప శాలువా, పూలమాలల వేసి సన్మానించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం మంచాల మండల అధ్యక్షుడు కొత్తూరు శేఖరప్ప, ప్రధాన కార్యదర్శి జక్క హరీష్ ఆధ్వర్యంలో జరిగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో, విద్యారంగానికి చేసిన కృషి కి గాను డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి శాలువా తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళ్ల శస్త్ర చికిత్స చేయించుకున్న వాళ్లకు కళ్లద్దాలు అందించారు. ఈ సందర్భంగా వి.ఆర్.వన్ ట్రస్ట్ చైర్మన్ కుకుడాల వెంకటేశ్వర్ రెడ్డి, జన సందేశ్ ఫౌండేషన్ చైర్మన్ జి లచ్చి రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.వెంకట రెడ్డి , జక్క నాగభూషణ్, జక్క పరమేష్ వెంబడి ఈశ్వరప్ప బకున రాజప్ప, ఏ నూతల రాజు, బిర్యాని సతీష్, బకున రాజేశ్వర్, జక్క పెంటప్ప, కడియాల పరమేశ్వరి, అక్షి త, నరసింహారెడ్డి, బాలరాజు, జక్క చంద్రశేఖర్, నూకం రాజు, ాండాల జంగయ్య, కృష్ణ, రాజేందర్ రెడ్డి, సత్య గౌడ్, మారగోని శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వీధి దీపాలు



వీధి దీపాలు ఏర్పాటు చేసిన దృశ్యం

**కేశంపేట, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో వీధి దీపాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను చూసి చెల్లించిన పల్లె బ్రదర్స్ తమ సొంత నిధులతో గ్రామంలోని ముఖ్య కూడలి అయిన గాంధీ స్కాచ్,అంబేద్కర్ స్కాచ్ లలో ఎల్ఈడి లైట్స్ ను వేయించారు. పుట్టి పెరిగిన గ్రామానికి తమ సొంత నిధులతో వీధి దీపాలను ఏర్పాటు చేయించిన పల్లె బ్రదర్స్ లను గ్రామస్తులు అభినందించారు.



పితృవియోగం పొందిన జహంగీర్‌ను పరామర్శిస్తున్న హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి

## బిఆర్ఎస్ నేత జహంగీర్‌కు హరీశ్‌రావు పరామర్శ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్ తండ్రి ఎండి ఖాసీం ఇటీవల మృతిచెందటంతో ఆయనను (పిత్రు వియోగంతో) మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు తుర్కపల్లికి వచ్చి పరామర్శించి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుబూతిని తెలియజేశారు. ఆదివారం రాత్రి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఎండి ఖాసీం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్‌ను, బిఆర్ఎస్ నాయకులు ఎండి యూసుఫ్‌బాబను ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఓదార్చి వారికి సాను భూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రాష్ట్ర అటవీ సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, ఎండి అన్వర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

**టిపిసిసి మైనార్టీ సెల్ నేత అశ్వక్ అలీ**

**షాబాద్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** తమ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి కష్టపడి చదివి ఉద్యోగాలకు పోటీపడుతున్న విద్యార్థులను కించపరిచే విధంగా మాట్లాడిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విద్యార్థులకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం విలేక రులతో మాట్లాడుతూ.. గ్రూప్ వన్ అభ్యర్థుల పై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని, వాటిని వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ తరపున న్యాయస్థానానికి వెళ్తామని హెచ్చరించారు.

## మట్టిలో మాణిక్యం

**పేదింటి అమ్మాయికి ఉన్నత ఉద్యోగం**

**యాచారం, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** యాచారం మండలం నంది వనపర్తి అనుబంధ గ్రామమైన పిల్లి పెల్లి గ్రామానికి చెందిన అయ్యగాని శోభ పాండు దంపతుల కుమార్తె ప్రవళికకు గ్రూప్ 2 ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించారు. నిరుపేద కుటుంబం నుండి యాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకూ చదివి, ప్రైవేటు పాఠశాలలో ఇంటర్ పూర్తి చేసుకొని, ఫార్మసీ అనంతరం 2022 లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి, ఉద్యోగ నిర్వర్తిస్తూనే ఎక్సైజ్ ఎస్సైగా గ్రూప్ 2 ఉద్యోగం సాధించారు.నిరుపేద కుటుంబం నుండి మారు మూల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉన్నతమైన ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలనే భేదం లేకుండా చిత్తశుద్ధితో చదువుకొని సంకల్పంతో ఉద్యోగం సాధించారని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# శరణు శరణు.. శాంభవీ


పూడూరు మండలం కడ్మూరుగ్రామంలో దుర్గామాత మండపంలో మహాచండీయాగం నిర్వహిస్తున్న భక్తులు


మేడ్చల్ మున్సిపాలిటీలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భవానీ భక్తులు, గాయని సింగర్ వీణ భవాని


ఆమనగల్లు పురాతన శివాలయంలో దుర్గమాతకు పూజలు చేస్తున్న బిసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి


శివారెడ్డిగూడలో మహా చండీరూపంలో అమ్మవారు


మండలం చెన్‌గోముల్‌లో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఎలికట్ట గ్రామంలో అమ్మవారికి పూజలు చేస్తున్న బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు

**యాచారం/పూడూరు/మేడ్చల్/ఘట్‌కేసర్ రూరల్/ఆమనగల్లు/ఘట్‌కేసర్/షాద్‌నగర్ :**
దసరా వేడుకలు ఆదివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయాలన్నింటిలో సందడి నెలకొంది. యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో గల జ్ఞాన సరస్వతి ఆలయంలో శ్రీ మహా చండి హోమం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ సదావెంకట్‌తో పాటు సమన్వయ మండలి సభ్యులు రాఘవేంద్ర శర్మ, సంగేం గణేష్, ఐలపురం పెద్ద జలంధర్ రెడ్డి, కొంగల్ల విష్ణు వర్ధన్ రెడ్డి, చిన్న జలంధర్, శివ కుమార్, నిఖిల్, సామ సంతోష్, మూడేడ్ల వెంకట్ రెడ్డి మరి యు మాతృ మండలి సభ్యులు రుద్రమ్మ, దీపిక రాణి తదితరులు పాల్గొన్నారు. పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామ శివాలయం ఆవరణలో దుర్గామాత అమ్మవారిని ఆదివారం మహా చండీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీయాగం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ నగర్ విజయ దశమి ఉత్సవాన్ని ఆదివారం మేడ్చల్ పట్టణంలోని కృష్ణ వేణి స్కూల్‌లో వినాయక నగర్, ఏక లవ్య నగర బస్తీ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గురుస్వామి రాజేశ్వర రావు పాల్గొన్నారు. ఇనగంటి లక్ష్మీ శ్రీధర్, బీజేపీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, స్వయం సేవ కులు పూర్తి గణవేష్, నాయకులు కిషన్‌రావు, ప్రభా కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గుప్త, సుధాకర్‌రెడ్డి, కిషోర్, లక్ష్మణ్, కవిరాజ్, బస్తి నగర ప్రముఖులు, మహి ళలు తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలో జర్నలిస్ట్ నవీన్ మాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ జనపద గాయ ని సింగర్ వీణ భవాని శంకర్ బృందం ఆలపించిన భక్తి పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఘట్‌కేసర్ రూరల్‌లో పోచారం మున్సిపల్ అన్నోజిగూడ శ్రీ గాయత్రీ ఆలయంలో శరన్నవరాత్రోత్స వాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు భక్తులకు కామేశ్వరి దేవి రూపంలో దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులచే నవ చండీ యాగం నిర్వహించారు. ఆలయ ట్రస్టు సభ్యుడు మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవి కన్యకపరమేశ్వరి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శాకాంబరిదేవి అవతారంలో భక్తులు దుర్గమాతను పూజించారు. ఆలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు వీరబొమ్మ రామోహన్‌గుప్త ఎస్సై బి. వెంకటేశ్, తలకొండపల్లి ఎస్సై తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డు పురాతన శివాలయంలో జరుగుతున్న శ్రీ దేవినవరాత్రి ఉత్సవాలను జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పాల్గొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దసరా ఉత్సవం ఆదివారం ఆమనగల్లు మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. పట్టణంలోని అరబిందో స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్‌ఎస్ఎస్ స్వయం సేవకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంఘ్ చాలక్ బావండ్ల అంజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బాలాజీనగర్ కృష్ణదేవాలయ ధర్మకర్త రామావత్ బిచ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో ఎన్ఎఫ్‌సీనగర్‌లోని రామగిరిపై శ్రీరామ కళ్యాణ కామేశ్వరీ ఆలయంలో కళ్యాణ కామేశ్వరీ అమ్మవారికి అభిషేకం, అర్చన, మూలమంత్ర హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యం వహించారు. ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని శివశంకరీ దేవపీఠంలో అమ్మవారు కాత్యాయినిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివారెడ్డిగూడలోని శ్రీభ్రమరాంబమల్లిఖార్జునస్వామి ఆలయంలో అమ్మవారు మహాచండీ రూపంలో దర్శనమిచ్చారు. ఎదులాబాద్‌లోని శ్రీ భ్రమరాంబికా మల్లి కార్జునస్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీమహాచండీదేవి/గౌరీదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఘట్‌కేసర్ గురుకుల్‌లో శ్రీభవాని నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో ఆదివారం అమ్మవారు శ్రీమహాచండీదేవి రూపంలో దర్శనమిచ్చారు. పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్‌గ్రామంలో ఆదివారం దుర్గామాత ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భజనమండలీలచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఫరూఖ్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో వెలిసిన అమ్మ వారిని బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, వెంకనోళ్ల వెంకటేష్, విట్టాల నరసింహ




## బిజిలి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

**శామీర్‌పేట, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనపై విద్యుత్ వినియోగదారులకు సేవా పర్వ్ కార్యక్రమంలో భాగంగా టిజిఆర్ఇడిసిఎ జిల్లా మేనేజర్ పవన్‌చందు, అలియాబాద్ విద్యుత్ ఎఇ వెంకటనారాయణల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఆదివారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. టిజిఆర్ఇడిసిఎ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఆధ్వర్యంలో సేవా పర్వ్ కార్యక్రమం కొనసాగుతున్నందున ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన క్రింద అవగాహన సదస్సును నిర్వహించి ఈ పథకం ద్వారా ఆన్ గ్రిడ్ సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని వారు తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించటం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ బిల్లు వస్తుందని, తెలంగాణ రాష్ట్రం ఇంధన భద్రతను సాధించటానికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించటానికి సహాయ పడుతుందన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించుకోవచ్చని వారు తెలియజేశారు. దరఖాస్తులను వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చని వారు సూచించారు. ఈ స్కీమ్ కరపత్రాలను వారు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఆర్ఇడిసిఎ ఫీల్డ్ ఆఫీసర్ ఓంప్రకాశ్, అలియాబాద్, శామీర్‌పేట విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు

## తండా యువకుడు మృతి

**ఆమనగల్లు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఆమనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీశైలం హైవే మేడిగడ్డ తండా వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఆమనగల్లు ఎస్సై బి వెంకటేష్ వెల్లడించారు. మండల పరిధిలోని పాపర్ల బోడు తండాకు చెందిన కేతావత్ వినోద్ (28)తన బైకుపై తండా నుంచి ఆమనగల్ వైపు వెళుతుండగా హైదరాబాద్ నుంచి అచ్చంపేట వెళ్తున్న కారు బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ పై వెళ్తున్న వినోద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. విషయం తెలుసుకున్న బంధువులు తండవాసులు ఆందోళనకు దిగి జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో ఇరువైపుల కిలోమీటర మేర అరగంట పాటు భారీగా ట్రాఫిక్ జామ్ చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ సీ2 ఎన్ఎఫ్‌సీనగర్ పార్కు వద్ద ఆదివారం వెంకటాపూర్ నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 435 మందికి వైద్యులు, సిబ్బంది ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ రమాదేవి శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. పేదలకు 50 శాతం రాయితీపై ఆరోగ్య కార్డులు, గర్భిణీలకు నీలిమ9 పేరుతో ఆరోగ్య కార్డులను అందజేశారు. నీలిమ ఆసుపత్రి సీఓఓ ఆశీష్, ఏఓ నగేష్, భరత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి జంపాల రమేశ్, మాజీ సోసైటీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, గాదరి యాదగిరిరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు., ప్రొఫెసర్‌లు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

-- జిన్‌గుర్తి గ్రామంలో అవగాహన ర్యాలీ

**తాండూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. పరిసరాల పరిశుభ్రత మానవ మనుగడకు భద్రత అంటూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌లు అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌లు డాక్టర్ నవీన్‌కుమార్, కల్పన, శేఖర్, అర్చన, ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజవర్ధన్ తదితరులు విద్యార్థులతో కలిసి ఆదివారం తాండూరు మండలం జిన్‌గుర్తి గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వార్డులలో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించేలా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని అన్నారు. మద్యం, మాదక ద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

## రుణమాఫీపై గత ఎండీ నిర్లక్ష్యం.. చర్యలకు వినతి

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో మాజీ ఎండి కరుణాకర్ అవకతవకలకు పాల్పడ్డారని ఆయన నిర్లక్ష్యంతోనే రుణమాఫీ ప్రక్రియలో జాప్యం జరిగిందని తగిన చర్యలు తీసుకోవాలని సొసైటీ డైరక్టర్ చందుపట్ల ధర్మారెడ్డితో పాటు పలువురు రైతులు సొసైటీ ఎండీకి ఫిర్యాదు చేశారు. సొసైటీ గత మేనేజింగ్ డైరక్టర్ కరుణాకర్ అవినీతి, అక్రమాల కారణంగా రైతులకు ఋణమాఫీ కాలేదని వారు ఆరోపించారు. సొసైటీలో 1,189 మంది రైతులకు ఋణమాఫీ అమలు కాకపోవడానికి గత ఎండి కరుణాకర్ కారణమని పేర్కొన్నారు. గత ఎండీ కరుణాకర్ అర్హులైన రైతుల ఋణమాఫీ జాబితాను ఆలస్యంగా పంపించారని, రైతుల పేర్లు, తీసుకున్న ఋణాల మొత్తంలో కూడా ఎక్కువ, తక్కువగా చూపారని ఆరోపించారు. సొసైటీలో ఋణమాఫీ జాబితాలో అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణ అయ్యిందని అంతర్గత ఆడిట్ చేసి సహకార, వ్యవసాయ అధికారులకు 43 మంది ఋణమాఫీ అర్హులు కారని గుర్తించి జాబితాను నుంచి తొలగించి మరోసారి పంపాలని వ్యవసాయ అధికారులు సూచించారని తెలిపారు.

మండలంలో ఎంపీటీసీల రిజర్వేషన్ల కసరత్తు

## ఎదురుచూస్తున్న ఆశావాహులు

**తలకొండపల్లి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు ముమ్మరం చేస్తుండడంతో మండలంలో దసరా కంటే ముందే స్థానిక ఎన్నికల కోలాహలం మొదలు కావడంతో శనివారం ఉదయం నుంచే ఎన్నికల వేడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు శనివారం ఉద యం నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నేతృత్వంలో మండలంలో ఆయా గ్రామాలలోని వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేశారు. తలకొండపల్లి మండలంలో మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అందులో ఎస్టీలకు 2, ఎస్సీలకు ఎస్సీలకు3, బీసీలకు5, జనరల్ కు 2 ఎంపీటీసీ స్థానాలు చొప్పున కేటాయించినట్లు తెలియ వచ్చింది. కందుకూరు మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎంపీటీసీ స్థానాలు కోసం కసరత్తు పూర్తి చేసినట్లు తెలియ వచ్చింది. తలకొండపల్లి మండలంలోని రాంపూర్, జూలపల్లి, ఎస్సీ జనరల్, గట్టు ఇప్పలపల్లి ఎస్సీ మహిళ, చుక్కాపూర్ ఎస్టీ జనరల్, ఖానాపూర్ ఎస్టీ మహిళ, చంద్రధన , దేవుని పడకల్ బిసి మహిళా, పడకల్, చౌదర్పల్లి ,తలకొండపల్లి, బిసి జనరల్, వెల్జల్ జనరల్ మహిళ, చీపునుంతల జనరల్ స్థానాలుగా కేటాయించినట్లు తెలియ వచ్చింది. ఈ స్థానాలతో ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు అనధికారికంగా తెలియపరిచారు.

**తలకొండపల్లి సర్పంచుల రిజర్వేషన్ ...**

**తలకొండపల్లి , ప్టెంబర్ 28, ప్రభాతవార్త :** 1.రాంపూర్ బిసి మహి2.గౌరిపల్లి ఎస్టి జనరల్3.చెన్నారం ఎస్టీ మహి4.మెదక్ పల్లి ఎస్సి జనరల్5.వెల్జాల్ ఎస్సి మహి6.అంతారం ఎస్సి మహి7.జంగారెడ్డిపల్లి ఎస్సి జనరల్8.గట్టు ఇప్పలపల్లిఎస్సీ జర్నల్ 9.చంద్రధన ఎస్సి మహిళ10.జూలపల్ల బిసి జనరల్11.చౌదర్‌పల్లి బిసి మహిళ 12.చుక్కాపూర్ బిసి జనరల్13.పడకల్ బిసి మహిళ14.తలకొండపల్లి బిసి జనరల్15.చిపునుంతల బిసి మహిళ 16.ఈరన్నపల్లి బిసి జనరల్17.ఖానాపూర్ బిసి మహిళ18.నింగారావుపల్లి బిసి జనరల్ 19.బల్సులపల్లి జనరల్ మహిళ20.దేవుని పడకల్ జనరల్ మహిళ21.మాదాయిపల్లి ఓసి జనరల్22.వెంకటాపూర్ జనరల్ మహిళ 23.వెంకట్రావు పేట జనరల్ 24.గడ్డమీదితాండ జనరల్ మహి 25.హర్య నాయక్ తాండ జనరల్ మహిళ 26.కోమటికుంట తాండ జనరల్ మహిళ 27.పుల్‌సింగ్ తాండ జనరల్ 28.పడమటి తాండ జనరల్ మహిళ 29.తుమ్మలకుంటతాండ ఎస్టీ మహిళ 30.వెంకటాపూర్ తాండ ఓసి మహిళ 31.కొరింతకుంట ఎస్టి మహిళ 32.తాళగుట్టతాండ ఎస్టీ మహిళ

**బిసి జెఏసి నేతల నిరసన**

**షాద్‌నగర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాంతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నంబర్ 9 ను ప్రభుత్వం తీసుకొస్తే దాన్ని వ్యతిరేకిస్తూ రెడ్డి జాగ్రుతి సంస్థ హై కోర్టులో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు తగ్గించాలని వేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీసీ జేఏసీ బహుజన నేతలు ప్లక్ కార్డులు చెతపట్టుకొని రెడ్డి జాగృతి సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు ఈ సందర్భంగా బీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ (ఈడబ్ల్యుసి) కోట పది శాతం విద్య ఉద్యోగాల్లో పెంచినప్పుడు దానిని బీసీలు ఎప్పుడూ కూడా వ్యతిరేకించలేదు కానీ కేవలం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయంపై రెడ్డి జాగ్రుతి సంస్థ కోర్టుకు వెళ్ళడంలో అంతర్యం ఏమిటో తెలపాలని అన్నారు వెంటనే ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని కోరారు అదేవిధంగా బిసిలకు విద్య ఉద్యోగాల్లో రాజకీయాలలో కూడా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు సమాజంలో రెండు వర్గాల మధ్య అలజడి సృష్టించే విధంగా పూనుకుంటున్న రెడ్డి జాగ్రుతి సంస్థను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ బహుజన నేతలు టీజీ.శ్రీనివాస్ రవీంద్రనాథ్ అర్జునప్ప నర్సింలు గౌడ్ కరుణాకర్ చంద్రశేఖరప్ప వెంకటేష్ శంకర్ శ్రీను నర్సింలు నరేష్ రామలింగం శేఖర్ గౌడ్ వలిగ కృష్ణ బిజిలి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## నిరసన వ్యక్తం చేస్తున్న బిసి జేఏసీ నాయకులు

హస్నాబాద్ చెరువు అలుగులో సందడి చేసిన కాలకేయ ప్రభాకర్..

**దుద్యాల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హస్నాబాద్ చెరువు అలుగులో బాహుబలి చిత్రం ప్రధాన ప్రతి నాయకుడు కాలకేయ ప్రభాకర్ ఆదివారం సందడి చేశారు. మూడు సంవత్సరాల తర్వాత అలుగు పారడంతో హస్నాబాద్ తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పర్యాటకులు నిత్యం వస్తు కాలక్షేపం చేస్తున్నారు. గ్రామానికి వచ్చిన కాలకేయ ప్రభాకర్ చెరువు అలుగు ు చూడడానికి వెళ్లి పర్యాటకులతో త ను కూడా కాలక్షేపం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో చెరువులు పారినప్పుడు స్నేహితులతో కలిసి ఎంతో ఆనందంగా గడిపే వారమని చిత్రసీమలో బిజీగా మారడంతో గ్యాప్ వచ్చిందన్నారు. ఈ సంవత్సరం అలుగు పారుతుందన్న వార్త తెలుసుకొని ప్రత్యేకంగా అలుగు చూడడానికి వచ్చామన్నారు. పారుతున్న చెరువులు చూడడం చాలా ఆనందంగా అనిపించిందని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయని చెప్పుకొచ్చారు. అలుగులో ఆయనతో పాటు ఫోటోలు దిగడానికి పర్యాటకులు ఎగబడ్డారు.గ్రామంలోని గౌడ్స్ కాలనీలో ఏర్పాటుచేసిన దుర్గామాత ను కాలకేయ ప్రభాకర్ ఆయన భార్య రాజ్యలక్ష్మితో కలిసి దర్శించుకున్నారు. మాపై దయ ఉంచమ్మ అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

**బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం**

**యాచారం, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** స్థానిక సంస్థ ఎన్నికలలో నాయకులు కార్యకర్తలు సమన్వయంతో సమిష్టిగా గెలిపే లక్ష్యంగా పనిచేయాలని నందివనపర్తి మాజీ సర్పంచ్ డాక్టర్ వర్త్యావత్ రాజు నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ మొదలైన సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి రాజు నాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు క్రమశిక్షణ సమన్వయంతో పని చేస్తున్నారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ ఎంపీటీసీ వార్డు సభ్యులు అన్ని బిఆర్ఎస్ కైవసం చేసుకోవాలని కోరారు.కార్యకర్తలు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండాపురం యాదయ్య, ముక్తాల యాదయ్య,మాజీ ఉపసర్పంచ్ మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీశైలం, బీరప్ప,చంద్రకాంత్, శేఖర్, యాంజల యాదయ్య, యాంజల వెంకటష్, లాజర్, ప్రభు, రమేష్ నాయక్ పాల్గొన్నారు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

## గందరగోళంగా రిజర్వేషన్ల ప్రక్రియ

-తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

**కుల్కచర్ల, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపాల్ వెంకట్ అన్నారు. సామాజిక మాధ్యమాలలో జిల్లా అంతటా జెడ్పిటిసి, ఎంపిపి, ఎంపీటీసీ, సర్పంచుల రిజర్వేషన్ల ప్రక్రియ జాబితాలు చక్కర్లు కొడుతున్నా అధికారికంగా జాబితాలు విడుదల ఎప్పుడోనని గందరగోళంలో నాయకులు ఉన్నారని, రిజర్వేషన్లపై కసరత్తు జరుగుతున్న విధానాన్ని వెంకట్ తప్పు పట్టారు. గ్రామాల వారిగా ఎంపిటిసిలు మండలాల వారిగా ఎంపీపీ,జెడ్పిటిసిల రిజర్వేషన్ల ప్రక్రియ చాలా లోపభూయిష్టంగా ఉందన్నారు.. సామాజిక మాధ్యమాల వచ్చిన సమాచారాన్ని అధికారులతో వివరణ కోరగా, మాకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని సమాచారం అందిస్తున్నారని, రిజర్వేషన్లపై గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. అధికారులు, రాజకీయ నాయకుల తీరు చూస్తుంటే ప్రజలు అయోమయంలో పడుతున్నారన్నారు.



## ఆర్ఎస్ఎస్ శత సంవత్సర ఉత్సవాలు..

-వీధుల గుండా కవాతు నిర్వహించిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు..

**దుద్యాల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మండల పరిధిలోని పోలేపల్లి లో ఆదివారం కవాతు నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన కవాతు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. బోలో భారత్ మాతాకీ జై అంటూ వీధుల గుండా నినాదాలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ డాక్టర్ కేశవరావు బలిరామ్, హెగ్డావర్ 1925 లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించారన్నారు. నాటి నుండి నేటి వరకు కోట్ల మంది ఆర్ఎస్ఎస్ లో చేరారని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాలు కలిగిన వారు నేడు దేశాన్ని పాలిస్తున్నారంటే సంస్థ ఎంత పవిత్రమైనదో, ఎంత కట్టుదిట్టమైనదో అర్థం చేసుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి ఇప్పుడు వస్తున్న విజయదశమి నాటికి 100 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. శత సంవత్సరమవుతున్న సందర్భంగా పోలేపల్లి లో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు బెర్కుటి మల్లేష్ యాదవ్, శ్రీరామ్, వెంకటేష్ యాదవ్, సుదర్శన్ రెడ్డి, బాల్ రాజ్, రాజశేఖర్, గణేష్, చంద్రప్ప, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**దుర్గమాతకు పూజలు చేసిన ఎమ్మెల్యే నందిగామ, సెప్టెంబర్ 28,** ప్రభాతవార్త : అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా దీవించమని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వేడుకున్నారు. ఆదివారం నందిగామ మండల కేంద్రంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పా టుచేసిన దుర్గామాత వద్ద ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ పూజల్లో మాజీ ఎం పీపీ ఎం శివశంకర్ గౌడ్,మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ,చంద్రపాల్ రెడ్డి ,దేపల్లె కుమార్ గౌడ్, శివాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సార రవి, సంతోష్, శ్రీహరి, శివ, సూరి, చంద్రశేఖర్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

## రైల్వే సీసీఎస్‌లో ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు : చిలుక స్వామి

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 28 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే సీసీఎస్ సభ్యులకు అన్ని విధాలా బెనిఫిట్స్ అందిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చిలుక స్వామి తెలిపారు. శనివారం మేనేజ్ మెంట్ బోర్డు సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. ప్రమాద బీమా రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుటకు బోర్డు ఆమోదం తెలిపింది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది, ఉద్యోగి మరణిస్తే అంత్యక్రియల నిమిత్త ఖర్చులు రూ.10 వేల నుంచి రూ. 15 వేలకు పెంచారు. 2024=25 ఆర్థిక సంవత్సరానికి గాను డివిడెండ్ గరిష్టంగా 18 శాతం దీపావళి కానుక అందించుటకు బోర్డు ఆమోదం తెలిపింది. ఉన్నత విద్య కోసం ఎడ్యుకేషన్ లోన్ రూ.2 లక్షల పెంపు విషయమై పరిశీలనలో ఉంచినట్లు తెలిపారు. సీసీఎస్ ఉపాధ్యక్షులు ఆర్.రామోహన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# 30న సద్దుల బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు పూర్తి



దత్తాత్రేయనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఘట్‌కేసర్‌లో 7వ రోజునే సద్దుల బతుకమ్మ జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్, బాలాజీనగర్, ఇడబ్ల్యుఎస్‌కాలనీ, గాంధీనగర్, మేడపాటినగర్, చిన్నచెరువు, గురుకుల్ మైదానం, పటేల్‌నగర్, నాగులమ్మ, బుగ్గానగర్, టీచర్స్‌కాలనీ, ఆర్‌కెనగర్, బ్రూక్‌బాండ్‌కాలనీ, సాయినగర్, రాంనగర్, ఎన్‌ఎఫ్‌సీనగర్, దత్తాత్రేయనగర్, బొక్కోనిగూడ, చందుపట్లగూడ, పరమేశ్వరీనగర్ కాలనీల్లో మహిళలు సద్దుల బతుకమ్మను జరుపుకున్నారు. తీరొక్క పువ్వులతో బతుకమ్మలను ఆర్షణీయంగా తయారు చేసి పసుపుతో గౌరమ్మను చేసి బతుకమ్మ వద్ద నైవేధ్యాలను సమర్పించారు. కాలనీల్లో ప్రధాన స్థలాలను శుభ్రం చేసి బతుకమ్మలను ఒక చోట చేర్చి చప్పట్లూ కొడుతూ పాటలు పాడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. మరో కొన్ని చోట్ల స్పీకర్ సౌండ్స్ పెట్టి బతుకమ్మ, దాండియా, కోలాటం ఆడారు. ఘట్‌కేసర్‌లో బంతి, చామంతి, గునుగు, తంగేడు పువ్వుల అమ్మకాలు జోరుగా జరిగాయి. అనంతరం బతుకమ్మలను చెరువులు, కుంటలు, వాగులలో నిమజ్జనం చేసి ప్రసాదాలను పంపిణీ చేసుకున్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనియాదవ్, మాజీ కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి, బొక్క సంగీత, కొమ్మిడి అనురాధ, సల్లూరి నాగజ్యోతి, బర్ల శశికళ, బండారి వసంత, మాజజీ కోప్షన్ సభ్యురాలు పల్లె అరుణ తదితరులు పాల్గొన్నారు.

**30న సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి**

**శామీర్‌పేట, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** ఈ నెల 30వ తేదీన జరిగే సద్దుల బతుకమ్మ పండుగ కోసం తూంకుంట మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో, గ్రామాల్లో గల చెరువుల వద్ద అన్ని బతుకమ్మ పండుగ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు, ప్రజలు చెరువు,కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ఆర్ జ్యోతి సూచించారు. బతుకమ్మ సంబరాలు, ఉత్సవాలను మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ మంగళవారం జరిగే సద్దులబతుకమ్మ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ పండుగ రోజున బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో పురపాలక సంఘం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వర్షాలతో దాదాపు అన్ని చెరువు, కుంటలు నిండినందున అలుగులు పారుతున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అందరు కూడ అప్రమత్తంగ ఉండాలన్నారు. బతుకమ్మలు చెరువు,కుంటల్లో నిమజ్జనం చేసే సమయంలో ఎవరు కూడ నీటిలోకి దిగవద్దని, ప్రతి చెరువు,కుంటల వద్ద మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని బతుకమ్మలు వారికి అందజేస్తే వారే నేరుగా నిమజ్జనం చేస్తారని ఆమె తెలిపారు. ఎక్కడ కూడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఉండాలని అందుకోసం అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జ్యోతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడ సద్దులబతుకమ్మను మంగళవారం జరుపుకోవటానికి ఉత్తర్వులను జారీ చేసింది. అన్ని గ్రామాల్లోనూ 30న సద్దుల బతుకమ్మను జరుపుకోవటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**

**పూడూరు :** పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామ శివాలయం ఆవరణలో అనంతరం మహిళలు తెలంగాణ సాంప్రదాయంగా నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో భాగంగా యాపకాయల బతుకమ్మని పేర్చి బతుకమ్మ ఆటపాటలతోపాటు కోలాటం, వివిధ రకాల నృత్యాలు నిర్వహించారు.

**గురుకుల్‌లో ...**

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో శనివారం రాత్రి జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఇక్కడ 7వ రోజునే సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. గురుకుల్ మైదానంలో మాజీ సర్పంచ్-జనచైతన్యసేవాసమితి వ్యవస్థాపకులు అబ్బసాని యాదగిరియాదవ్ నేతృత్వంలో బతుకమ్మ సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్‌లు ముఖ్యఅతిధిగా విచ్చేసి బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. ఘట్‌కేసర్ ఉమ్మడి మండలంలో ఘట్‌కేసర్ పట్టణంలోనే మొదటగా ఏడురోజులు నిర్వహించి బతుకమ్మ వేడుకలను ముగిస్తారు. పట్టణంలోని వివిధ కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు బతుకమ్మలను తీసుకువచ్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. మైదానంలో మైమాస్ట్‌లైట్లు, డీజే శబ్దాల మధ్య బతుకమ్మ, దాండియా, కోలాటం, పాట, ఆటలతో సంబరాలు ఘనంగా జరిగాయి. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్ మహిళలతో బతుకమ్మ నృత్యాలు చేస్తూ ఉత్సాహ పరిచారు. అనంతరం బతుకమ్మలను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో నిమజ్జనం చేశారు. ప్రతియేటా గురుకుల్‌లో సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు యాదగిరియాదవ్ తెలిపారు. పలువురు కౌన్సిలర్లు, స్వామి వివేకానంద, జనచైతన్యసేవాసమితి, యువజన సంఘాల సభ్యులు, నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను నిర్వహకులు శాలువాలతో సన్మానించారు. సీఐ బాలస్వామి, డిఐ శ్రీనివాస్, ఎస్ఐ శేఖర్, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్, బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి, బర్ల శశకళ దేవేందర్, బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్, మాజీ సర్పంచ్ మెడబోయిన వెంకటేశ్, మాజీ ఎంపిటిసి పొట్లచెరువు మంగ శ్రీరాములు, సొసైటీ మాజీ చైర్మన్ సార శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాలుయాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ, జేసీఎస్ఎస్ అధ్యక్షులు అంకం రాజేశ్వర్‌రావుయాదవ్, ప్రధాన కార్యదర్శి సార శ్రీనివాస్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శివరాత్రి సురేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు కేశవపట్నం అంజనేయులు, అబ్బసాని పొన్నయ్యయాదవ్, శశిధరణ్, నాగభూషణంచారీ, కొరుబోతు నాగరాజు, గాజుల వీరేందర్‌యాదవ్, రాజరాజు, దంతాల అనిల్‌కుమార్, ఆర్.రాంచందర్‌యాదవ్, నాంపల్లి సంతోష్, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారతీయ సంస్కృతికి మూలం కన్హాశాంతి వనం

(మొదటి పేజీ తరువాయి)

జీవించి ఉన్న గురువు పాత్ర గురించి మాట్లాడుతూ జీవించి ఉన్న గురువు మీకు మరియు దైవానికి మధ్య వారిది. ఆయన మార్గదర్శకత్వం అంతర్గత పరివర్తనకు ప్రపంచం మరియు పర్యావరణతో మన పరస్పర చర్యకు దారితీస్తుంది అన్నారు. అనంతరం దాజి అద్భుతమైన కృషికి, విశిష్టమైన సేవలకు మరియు ఆధ్యాత్మికత, పర్యావరణం మరియు అనేక రంగాలలో ఆయన తెచ్చిన మహత్తర విప్లవానికి సభలో అందరూ ఘనాభివందనాలు తెలియజేశారు.

## ఉన్నత భవిత కోసమే ఎసిటి

(మొదటి పేజీ తరువాయి)

ఎటిసి సెంటర్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇప్పటి నుంచి మీర థియరీతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలన్నారు. ఎన్ని విషయాలు తెలిసి ఉన్నప్పటికీ వాటి గురించి బయటకు చెప్పగలిగినపుడే గుర్తింపు వస్తుందని కలెక్టర్ అన్నారు. మీలోని సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఏదో ఉద్యోగం కోసం కాకుండ పది మందికి ఉపాధి కల్పించే విధంగ పెద్దగా ఆలోచించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మీరు చదివే అంశాల గురించి విశ్లేషణ చేస్తుంటే మీకు కొత్త కొత్త ఆలోచనలు వస్తుంటాయని, వాటిలో ముఖ్యమైన అంశాల గురించి చర్చించాలని సూచించారు. ముందుగా ఎటిసి సెంటర్‌ను ప్రారంభించి ఆ తరువాత సెంటర్‌లోని మిషన్లకు కలెక్టర్ మనుచౌదరి పూజలు చేశారు. అనంతరం ఎసిటి సెంటర్‌లోని అన్ని గదులను తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక, ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ లలిత, జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ .. పరేషాన్

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాస్‌రెడ్డి తన టిక్కెట్ త్యాగం చేశారు. చివరి నిముషంలో తాండూరు కాంగ్రెస్ టిక్కెట్ దక్కించుకున్న మనోహర్‌రెడ్డి విజయంలో తమ్ముడు శ్రీనివాస్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడిగా లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెడతారని ప్రచారం జరిగింది. చివరి నిముషంలో ఆ పదవులు ఇతరులను వరించాయి. ఈసారి జిల్లా పరిషత్ చైర్మన్ జనరల్‌కు కేటాయిస్తే శ్రీనివాస్‌రెడ్డి పోటీ చేసేందుకు సిద్ధమైనారు. ఐదారు మాసాలుగా వ్యూహరచన చేశారు. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలు ఉండగా మెజార్టీ స్థానాలను గెలిపించుకోవాలని పావులు కదిపారు. జనరల్ మహిళకు రిజర్వు అయితే తన సతీమణి సరళారెడ్డిని బరిలో దించాలని యోచించారు. శనివారం రిజర్వేషన్లు తారుమారు కావడంతో శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులు తీవ్ర నిరాశకు గురైనారు. ఆదివారం పరిగి నియోజకవర్గానికి చెందిన ఆయన అనుచర బృందం మహబూబ్‌నగర్‌లో రహస్యభేటీ నిర్వహించారు. చేతికి వచ్చిన ఎమ్మెల్యే టిక్కెట్‌ను అన్న కోసం త్యాగం చేయడం, ప్రస్తుతం జిల్లా పరిషత్ రిజర్వేషన్ చేజారడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిసింది. 2028లో జరిగి అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని వారు సూచించారు. పరిగిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి ఉన్నందున ఇతర పార్టీల నుంచి టిక్కెట్ తెచ్చుకోవాలని కొంతమంది సూచించినట్లు తెలిసింది. పార్టీ ఏదైనా సరే.. భవిష్యత్‌లో పరిగి నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కులకచర్ల, గండీడ్, దోమ, పరిగి, చౌడాపూర్ మండలాలకు చెందిన సుమారు 40 మంది ముఖ్యమైన అనుచరులు భేటీలో పాల్గొన్నారు. త్వరలో మరో భేటీ జరుపాలని నిర్ణయించారు.

## ఎన్ని'కల' చెదిరిందా

(మొదటి పేజీ తరువాయి)

9 నెలల క్రితమే మున్సిపాలిటీల పాలకవర్గాలు దిగిపోయాయి. ఎప్పటికప్పుడు ఎన్నికల షెడ్యూల్‌పై దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నా రిజర్వేషన్ల అంశం వల్ల తాత్కాలిక బ్రేక్ పడుతోందని భావిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఇటీవల ఆకస్మిక మరణం వల్ల ఆ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించడం అనివార్యమైంది. వచ్చేనెలలో బీహార్ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూబ్లీహిల్స్ ఎన్నికలు కూడా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఒకవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, మరోవైపు రిజర్వేషన్ల అంశంతో పాటు ప్రస్తుతం రాష్ట్రమంతటా భారీ వర్షాలు పడుతుండం స్థానిక ఎన్నికలకు ప్రతికూలంగా మారుతుందని అనుకుంటున్నారు.

## నెలకు మూడు సార్లు ఇక్కడికే వస్తా

(మొదటి పేజీ తరువాయి)

నెలకు మూడుసార్లు ఇక్కడికే వచ్చి ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తామని వివరించారు. ప్రపంచంలో ఎవరూ ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చినా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలోనే కూర్చుని మాట్లాడుతానని, ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తా. సింగరేణి కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఇక్కడ పది ఎకరాలు కేటాయించాలని మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబుకు ఆదేశించారు. 2026 డిసెంబర్‌లోగా ఆ కార్యాలయ నిర్మాణం పూర్తిచేసుకునేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు, సీనియర్ నాయకులు జంగారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, దేప భాస్కర్, బొక్క జంగారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, సీనియర్ నాయకులు, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, అమరేందర్ రెడ్డి, కాకీ ఈశ్వర్ ముదిరాజ్ , యాదయ్య, జగన్, వెంకట రాంరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## పంటలన్నీ సర్వనాశనం

(మొదటి పేజీ తరువాయి)

లక్షల క్వింటాళ్ల కందులు దిగుబడి సాధిస్తారు. ఈసారి లక్ష క్వింటాళ్లు కూడా సాధించడం గగనమే అంటున్నారు. కూరగాయల్లో టమాటా, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, వంకాయ, బీర తదితర పంటలు నేలమట్టం అయ్యాయి. ఆకుకూరలు, పూల పంటలకూ అపార నష్టం వాటిల్లిందని రైతులు విలపిస్తున్నారు. వికారాబాద్, నవాబ్‌పేట, మోమిన్‌పేట, ధారూరు, పూడూరు మండలాల్లో అధికంగా పూలసాగు చేస్తారు. దసరా, దీపావళి పర్వదినాలకు ఈ ప్రాంతాల నుంచి పూలను హైదరాబాద్‌కు తరలిస్తారు. ఈసారి భారీగా నష్టాలు చవిచూడక తప్పదేమో అంటున్నారు. ప్రభుత్వం సమగ్రంగా అంచనాలు రూపొందించి నష్టపోయిన రైతులు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

## కారిడార్ కాక

(మొదటి పేజీ తరువాయి)

బాధితులను ఆదుకోవాలన్నారు. ఈ విషయంపై అధికారులు పలుసార్లు సమావేశాలు నిర్వహించినా వారు చెప్పటం తప్ప బాధితుల అభిప్రాయాలు తీసుకోవటం లేదని, పట్టించుకోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు వెడల్పులో 200ఫీట్ల నుంచి 120పీట్ల వెడల్పుకు తగ్గించాలని బాధితులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అయితే ఈ రోడ్డులో భూములు, షాపులు,స్థలాలు కోల్పోతున్న వారికి న్యాయంగా ఉండే విధంగ పరిహారం చెల్లించాలని, లేదా నగరం శివారులో, తూంకుంటలో బాధితులకు స్థలాలు ఇవ్వాలని బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పలువురు బాధితులు కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ సతీష్‌గుప్తా, కాసుల ఈశ్వర్‌గౌడ్, దయాసాగర్‌యాదవ్, సుభాష్‌గౌడ్, సూర్యప్రకాశ్‌రెడ్డి,దయాసాగర్, సోనారామ్, మల్లేశ్‌గౌడ్, నరేందర్‌గౌడ్, విక్రమ్‌గౌడ్,పలువురు బాధితులు పాల్గొన్నారు.

## గాన గంధర్వుడు ఎస్పీ బాలుకు ఘన నివాళి

### గీతాలతో అలరించిన కళాకారులు..

**షాద్‌నగర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త :** గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతి సందర్భంగా ఆయన పాటలతో కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతీ కళా పీఠం (ఎస్.ఎస్.కే.పి) ఆధ్వర్యంలో కేపీ హెచ్ బిలో గల "ప్రకాస స్టూడియో"లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో షాద్ నగర్ కు చెందిన ఖాజాపాషా తన గాత్రంతో ఆకట్టుకున్నారు. నిర్వాహకురాలు రోజా మధిర, వేణుగోపాల్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలు పాటల పూతోటలో బాలు స్వర సుగంధాలను వెదజల్లాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వేణుగోపాల్, షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టులు కస్తూరి రంగనాథ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 42శాతం రిజర్వేషన్‌లు పచ్చి మోసం .!

**తాండూరు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్‌ల పేరుతో మోసం చేయాలని ప్రయత్నిస్తుందని రాష్ట్ర బిసి కమిషన్ మాజీ సభ్యులు నూలి శుభప్రద్ పటేల్ అన్నారు. ఆదివారం తాండూరులోని ఎన్ఎస్‌పి ట్రస్ట్ కార్యాలయంలో శుభప్రద్ పటేల్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బిసి రిజర్వేషన్‌లపై ఇచ్చిన జీఓ మోసపూరితంగా ఉందని ఆరోపించారు. కేవలం జీఓ మేరకే రిజర్వేషన్‌లు ప్రకటించే అవకాశం ఉంటే గత 22నెలలుగా ఎందుకు ఎన్నికలకు వెళ్లలేదంటూ ప్రశ్నించారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన ఆర్అండ్‌బి అధికారులు

**-తెగిపోయిన కోకట్ కాగ్నా నది బ్రిడ్జికి మరమ్మతులు --వాహనాల రాకపోకలకు మార్గం సుగమం**

**-హర్షం వ్యక్తం చేసిన ప్రజలు, వాహనదారులు**

**యాలాల, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాలతో తెగిపోయిన కోకట్ కాగ్నా నది బ్రిడ్జి మరమ్మత్తు పనులను ఆర్అండ్‌బి అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.ఆదివారం తాండూరు ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజనీర్ శ్రావణ్ ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా చేపట్టారు. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో యాలాల మండలంలోని కోకట్ కాగ్నా నది బ్రిడ్జి తెగిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం తాండూరు శాసన సభ్యులు మనోహర్‌రెడ్డి,జిల్లా కలెక్టర్. సబ్‌కలెక్టర్, జిల్లా ఎస్పీలు పరిశీలించారు.భారిగా వచ్చిన ప్రవాహ తాకిడికి కాగ్నా బ్రిడ్జి తెగిపోయింది.దీ ంతో తాండూరు నుంచి రాస్నం,ధారూర్,పరిగి,వికారాబాద్, ముద్దాయిపేట్, బొంరాస్‌పేట్, పగిడియాల్ తదితర గ్రామాలకు వాహనాల,ప్రజల రాకపోకలు నిలిచి పోయాయి.ఈ క్రమంలో ఎమ్మెల్యే వీలనంత త్వరగా బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించడంతో ఆదివారం అధికారులు తెగిపోయిన బ్రిడ్జిని మరమ్మతులు చేపట్టారు. ట్రాక్టర్లతో, టిప్పర్లతో నాపరాతి ముక్కలను వేసి పూడ్చి వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.దీంతో ఒక్కరోజులోనే అధికారులు, పాలకులు బ్రిడ్జి మర్మతులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించడంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మూసీనది జలప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్ఐ శేఖర్

## మూసీనది, ఎరుమల్లెవాగుకు వరద ప్రవాహం

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసినదిలో ఒక్కసారిగా వరదనీటి ప్రవాహం పెరిగిపోయింది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల నుంచి నీటిని వదుతుండటంతో మూసీనదికి వరద ప్రవాహం అధికమవుతున్నది. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్ సమీపంలోని ఫిలాయిపల్లి వంతెన వద్ద మూసీనది వరద ప్రవాహం ఉధృతంగా మారింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, ఎస్ఐ శేఖర్‌లు శనివారం మూసీనదిని పరిశీలించారు. ఘట్‌కేసర్ మండలంలో 19.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ఎగువప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ఎరుమల్లెవాగు నీటి ప్రవాహం పెరుగుతున్నది. ఘట్‌కేసర్ బైపాస్ రహదారి సర్వీస్‌రోడ్డుకు ఆనుకునే విధంగా వాగు ప్రవహిస్తున్నది. వర్షాలతో ఎదులాబాద్ లక్ష్మినారాయణచెరువు, ఎన్‌ఎఫ్‌సీనగర్ రాయికుంట, ఘట్‌కేసర్ చెట్టేరుకుంట, చందుపట్లగూడ పుల్చెరుకుంట చెరువులు పూర్తిగా నిండిపోయాయి.

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబర్ ,28 (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండ వర్షం కురుస్తుంది. దీంతో వాగులు వంకలు వర్షపు నీటితో ఉరకలు తీస్తున్నాయి. చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. ప్రస్తుతం చేతికి వచ్చిన జొన్న పంటలు నష్టపోయే అవకాశం ఉందని మండల రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. వర్షాల కారణంగ నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకోవాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉందని పలువురు అభిప్రాయపడుతన్నారు.



వర్షపు నీటితో అలుగు పారుతున్న ఎదిర చెరువు



## నిండుకుండలా సురసముద్రం చెరువు

**ఆమనగల్లు, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణ సురసముద్రం చెరువు నిండుకుండలా మారింది. దాదాపుగా చెరువు నీటి నిల్వలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. భారీ వర్షాల కారణంగా వరద నీరు పోటెత్తెడంతో చెరువు సందర్శకులకు కనువిందు చేస్తోంది. స్వల్ప కాలంలోనే చెరువు మరోసారి నిండుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ధారూర్-నాగసమందర్ మధ్య రాకపోకలు బంద్ : కొట్టుకుపోయిన బ్రిడ్జి**

**ధారూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ధారూర్ మండల పరిధిలోని నాగసమందర్-రుద్రారం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిపై సీసీ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. అటువైపు ఎవరు కూడా వెళ్ళరాదని ఎస్ఐ సున్నం రాఘవేందర్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు సాహసాలు చేసి దాటే ప్రయత్నాలు చేయరాదని చెప్పారు. వరద ఉధృత్తి ఎక్కువ ఉండడంతో కొట్టుకుపోయే అవకాశం ఉందని ఎవరు కూడా సాహసాలు చేయవద్దని కోరారు.



ధ్వంసమైన నాగసముంధర్ బ్రిడ్జి

## రైతులకు రుణమాఫీ చేయాలి

**-రిలేనిరాహారదీక్షలకు తాత్కాలిక విరమణ**

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు తప్పకుండా ఋణమాఫీ అమలు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్ తహశీల్దార్ కార్యాలయం ముందు ఉమ్మడి ఘట్‌కేసర్ మండల రైతుఋణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహారదీక్షలు ఆదివారంతో 19వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, బొక్క రవీందర్‌రెడ్డి, సామల బాల్‌రెడ్డి, కట్ట మధుసూధన్‌రెడ్డి, కంట్లం శివకుమార్, పడమటి శ్రీనివాస్‌రెడ్డిలు కూర్చుకున్నారు. ఘట్‌కేసర్ మాజీ ఎంపిపిలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం మాజీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డిలు వచ్చి సంఘీభావం తెలిపారు.



నిరాహారదీక్షలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్

ఈసందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వచ్చి దీక్షలో కూర్చొని రైతులతో మాట్లాడి దీక్షలను విరమింపజేశారు. ఘట్‌కేసర్ సొసైటీలో 1,189 మంది రైతులకు ఋణమాఫీ కాకపోవడం శోచనీయమన్నారు. రేవంత్‌రెడ్డి గతంలో మల్కాజ్‌గిరి నుంచి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారని ఇక్కడి రైతులను మరచిపోకుండా ఆయన సేవలు అందించాల్సిన అవసరముందన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ పరిధిలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన రైతులకు ఇంకా ఋణమాఫీ అమలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఘట్‌కేసర్ రైతులకు ఋణమాఫీ కోసం రూ.8 కోట్లకు పైగా నిధులు అవసరమున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఋణమాఫీ చేసేందుకు చొరవ చూపాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని, ఇప్పటికే ఋణమాఫీ విషయమై సీఎం కు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. రిలేనిరాహాదీక్షలకు తాత్కాలికంగా విరామం ఇవ్వాలని దసరా తర్వాత ఋణమాఫీ చేయకుంటే పోరాటం మరింత ఉధృతం చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. ఆర్ఆర్ఎస్ఎస్ కన్వీనర్ కంట్లం గౌరిశంకర్, సొసైటీ డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల దర్మారెడ్డి, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, కొమ్మిడి శోభారాణిదామోదర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పి.స్టీవెన్, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, మాజీ వార్డుసభ్యులు గడీల సంజీవరెడ్డి, గడీల రాంచంద్రారెడ్డి, వేముల మహేశ్వర్‌గౌడ్, నాయకులు బొక్క క్రిష్ణారెడ్డి, సాల్వేరు రఘు, రవీందర్‌రెడ్డి, అల్వా వీరారెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల వలకు చిక్కిన కొండచిలువ..

**దుద్యాల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లి గ్రామ శివారులో కొండచిలువ కలకలం సృష్టించింది. ఆదివారము మత్సకారులు చేపల వేట కోసం వేసిన వలలో భారీ కొండచిలువ చిక్కింది. చేపలు పడ్డాయా అని మత్స్యకారులు వల ను తీయబోగ ఎంతకి రాకపోవడంతో అ నుమానించిన మత్సకారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై యాదగిరి వెంటనే స్పందించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని వలలో చిక్కిన కొండచిలువ ను బయటకు తీశారు. అక్కడి నుండి ట్రాక్టర్లో తీసుకొని పోయి లగచర్ల అడవి ప్రాంతంలో విడిచినట్లు అటవీశాఖ బీట్ అధికారి రవి తెలిపారు.

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ మాదారంలో బొడ్రాయి ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. గ్రామంలో ప్రజలు నూతనంగా బొడ్రాయిని ఏర్పాటు చేసి పునఃప్రతిష్టాపన పూజలు జరిపారు. అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య బొడ్రాయిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామదేవతలకు డప్పుశబ్దాల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నైవేధ్యం సమర్పించారు. మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి విచ్చేసి బొడ్రాయిపూజలో పాల్గొనగా నిర్వహకులు ఆయనను సన్మానించారు. అంతకుమందు ఎమ్మెల్యే మర్రిపల్లిగూడలో దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో పోచారం మున్సిపల్ మాజీ వైఎస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, మాజీ సర్పంచులు నల్లోళ్ల యాదగిరి, పెద్దోళ్ల రమేశ్, మాజీ ఎంపిటిసి మంకం రవి, సొసైటీ డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, మున్సిపల్, మండల బీఆర్ఎస్ బండారి శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షులు నాగుల రమేశ్, ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, కీసరగుట్ట మాజీ డైరక్టర్ ఎంపాల సుధాకర్‌రెడ్డి, ఆర్‌బిఎస్ జిల్లా మాజీ సభ్యులు చిలుగూరి మంకయ్య, మాజీ ఉపసర్పంచ్ రవికుమార్, బాజీ వార్డుసభ్యులు బొడిగె శ్రీనివాస్‌గౌడ్, పసుమాల బాల్‌రాజ్, చిలుగూరి ఆనంద్, నాయకులు బద్దం జగన్మోహన్‌రెడ్డి, బొక్క క్రిష్ణారెడ్డి, చిలుగూరి లక్ష్మన్, పరమేశ్‌చారీ, చందుపట్ల లక్ష్మారెడ్డి, అల్లం శంకర్, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాదారంలో బొడ్రాయి ప్రతిష్ట పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## ప్రజా పాలనలో పల్లెలకు ప్రగతి కాంతులు

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ప్రజా పాలనలో ఇంటింటికి సౌభాగ్యం తెస్తూ, పల్లెలకు ప్రగతి కాంతులు తెస్తున్నామని షాద్నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఆదివారం నందిగామ మండల కేంద్రంలో హైస్కూల్ ఆవరణలో 10 అదనపు తరగతి గదుల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. షాద్నగర్ నుండి విజయలక్షి ్మ వరకు పాత రహదారిపై బటర్ ఫ్లై దీపాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్,మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ,చంద్రపాల్ రెడ్డి,దేపల్లె కుమార్ గౌడ్,పార్టీ అధ్యక్షులు జంగా నరసింహులు, జి హరినాథ్ రెడ్డి, నాయకులు జె, సుదర్శన్ గౌడ్, పసుల బుచ్చయ్య, సి నర్సింలు, కావలి కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, మంకాల శ్రీశైలం, సాములయ్య, తులసిరాం, బుగ్గోనిగూడ సాలయ్య, బుగ్గ శ్రవణ్, ఎం.గబ్రుచౌహాన్,పి. శ్రీను నాయక్, రూప్ సింగ్, శివగళ్ళ సుమన్, విగ్నేష్ రెడ్డి, సుక్య నాయక్, ఎన్.రవీందర్ గౌడ్, రాజశేఖర్, బండారి రాజు ముదిరాజ్, పర్వ తాలు, ఆకుల జ్ఞానేశ్వర్, ఆవుల శివశంకర్, ఉన్నారు.



నందిగామ హైస్కూల్లో అదనపు తరగతి గదులకు భూమ్ పూజ చేస్తున్న ఎమ్మెల్యే